సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం । 4 । మార్చి । 2025



సోమశిలలో 58.259 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 58.259 టీఎంసీల నీరు నిల్వ ఉంది. దిగువ వివిధ కాలువలకు 3680 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.87,850
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.7,953
3 శాతం జీఎస్టీతో	రూ.8,192
సవర (8 గ్రా)	రూ.65,536

గరిష్టం/కనిష్టం
36.0 /24.9

వాతావరణం

మంగళవారం జిల్లాలో వాతావరణం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ సోమవారం 55 శాతంగా నమోదైంది.



ఇఫ్తార్	సహర్
మంగళవారం	బుధవారం
సా: 6.19	ఉ: 5.05

రంజాన్ వేళలు

అడిగే దమ్ముందా?!

- చట్టానికి తూట్లు.. ఇష్టారాజ్యంగా నంబర్ ప్లేట్లు
- జిల్లాలో విచ్చలవిడిగా తిరుగుతున్న ఇతర రాష్ట్రాల వాహనాలు
- హోరెత్తిస్తున్న హారన్‌లు, ఎల్‌ఈడీ లైట్లు
- యథేచ్ఛగా వాహనాల అద్దాలకు బ్లాక్ ఫిల్మ్
- వాహనాల్లోనే అసాంఘిక కార్యకలాపాలు
- చోద్యం చూస్తున్న జిల్లా రవాణాశాఖ, పోలీసులు

▸▸ హైసెక్యూరిటీ ప్లేట్ల స్థానంలో పలు రకాల స్టిక్కర్లు

వాహన చట్టాన్ని రూపొందించే పాలకులు, అధికారులే.. ఆ చట్టాన్ని ధిక్కరిస్తున్నారు. జిల్లాలో రవాణా, పోలీస్‌శాఖలు పూర్తిగా చతికిల పడ్డాయి. నిబంధనలకు విరుద్ధంగా గతంలో ఎన్నడూ లేని కొత్త సంస్కృతి వాహనాల నంబర్ ప్లేట్లపై కనిపిస్తోంది. అధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు ప్రజలు సైతం ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ ఉన్న వాహనాలను జిల్లాలో తిప్పుతున్నారు. కార్లతోపాటు టెంపో అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆ చీకటి మాటున వాహనాల్లోనే అసాంఘిక కార్యకలాపాలు సాగిస్తున్నారు.

నెల్లూరు (టౌన్): జిల్లాలో ప్రజలకు ఆదర్శంగా ఉండాల్సిన ప్రభుత్వ నేతలు, అధికారులు రవాణాశాఖ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వారు వినియోగిస్తున్న వాహనాలను రవాణాశాఖ నిబంధనలకు విరుద్ధంగా తిప్పుతున్నారు. మమ్మల్ని అడిగే దమ్ము, ధైర్యం ఎవరికుంది అనుకున్నారో తెలియదు కానీ రవాణా శాఖ నిబంధనలు అతిక్రమిస్తూ ప్రవర్తిస్తున్నారు. జిల్లా రవాణాశాఖలో రిజిస్ట్రేషన్ కలిగిన 7 లక్షలకు పైగా వాహనాలు ఉన్నాయి. వీటిల్లో 5 లక్షలకు పైగా ద్విచక్ర వాహనాలు, లక్షకు పైగా నాలుగు చక్రాల వాహ నాలు, 40 వేలకు పైగా ఆటోలు, 10 వేలకు పైగా లారీలు, మిగిలినవి కాంట్రాక్ట్, స్టేజీ క్యారియర్ బస్సు లు, ట్రాక్టర్లు, మినీ వాహనాలు ఉన్నాయి. ఇవే కాకుండా ఇతర రాష్ట్రాల వాహనాలు కూడా ఉన్నాయి. ఇతర రాష్ట్రాల వాహనాలు జిల్లాలో తిరగడం రవాణాశాఖ నిబంధనలకు విరుద్ధం.

విచ్చలవిడిగా ఇతర రాష్ట్రాల వాహనాలు

ఇతర రాష్ట్రాల బైక్‌లు, కార్లు, లారీలు జిల్లాలో విచ్చలవిడిగా తిరుగుతున్నాయి. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇతర రాష్ట్రాల వాహనాలు జిల్లాకు వస్తే నెలకు మించి ఇక్కడ తిప్పడానికి వీల్లేదు. ఆపై ఇక్కడే తిరుగుతుంటే.. అటువంటి వాహనాలపై కేసు నమోదు చేయొచ్చు. చాలా మంది ఇతర రాష్ట్రాల్లో వాహనాలు కొనుగోలు చేసి జిల్లాలో తిప్పుతున్నారు. ఇటువంటి వాహనాలను కొనుగోలు చేస్తే ఏపీ మీద రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సి ఉంటుంది. మోడల్‌ను బట్టి వాహన జీవిత పన్ను చెల్లించాల్సి ఉంటుంది. ఇవేమీ పట్టించుకోని కొంత మంది వాహనదారులు తమ వాహనాలను యథేచ్ఛగా తిప్పుతూ ప్రభుత్వాదాయానికి గండి కొడుతున్నారు.



కారు అద్దాలకు ఏర్పాటు చేసిన బ్లాక్ ఫిల్మ్



నంబర్ ప్లేట్ కనిపించ కుండా అధికారి బోర్డు

ఎమ్మెల్యే తాలూకా నంబర్ ప్లేట్లు

వాహనానికి హైసెక్యూరిటీ నంబరు ప్లేట్లను మాత్రమే బిగించాలి. ఆ నంబరు ప్లేటు మీద ఎలాంటి రాతలు, పేర్లు ఉండకూడదు. అయితే జిల్లాలో కొత్త సంస్కృతి నడుస్తోంది. పూర్తిగా నంబర్ ప్లేట్లు తొలగించి.. ఆ స్థానంలో పలానా ఎమ్మెల్యే తాలూకా, డీసీఎం తాలూకా అంటూ రాజకీయ పార్టీల గుర్తులు, పేర్లలో స్టిక్కర్లు వేసుకుని విచ్చలవిడిగా తిరుగుతున్నారు. నేరస్తులు కొందరు ఈ తరహా స్టిక్కర్లతో వాహనాల్లో వెళ్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. చైన్ స్నాచింగ్‌లు, ఇతర నేరాలకు పాల్పడుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో నేరస్తుల జాడ గుర్తించడం కూడా కష్టమవుతోంది. రవాణా శాఖతో పాటు ట్రాఫిక్ పోలీసుల కళ్ల ముందే ఇలాంటి వాహనాలు వెళ్తున్నా.. కనీసం ఆ వాహనాన్ని ఆపే దమ్ము, ధైర్యం చేయలేకపోతున్నారు. ఇంకొందరైతే ప్రెస్ స్టిక్కర్లు వేసుకు ని తిరుగుతున్నారు. అస లు సిసలైన జర్నలిస్టులు ఎవరూ ప్రత్యేకంగా ఇ లాంటి స్టిక్కర్లు వేసుకోరు. ఇటువంటి జర్న లిస్టులకు కలెక్టర్ జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డులు ఉంటాయి. ఇందుకు భిన్నంగా ప్రెస్ స్టిక్కర్ కనబడితే ఎవరూ అడగరనే ధీమాతో పెద్దపెద్ద అక్షరాల్లో స్టికర్లు వేసుకుంటున్నారు. కొందరు నంబరు ప్లేటుపై ప్రభుత్వ వెహికల్, అధికారి హోదాతో మరో పెద్ద బోర్డు బిగించడం వంటివి చేస్తున్నారు.



పెద్ద అక్షరాల్లో ఆర్గనైజేషన్ హోదా బోర్డు

హారన్ల మోతతో సౌండ్ పొల్యూషన్

వాహనాలతోపాటు వచ్చే హారన్లను తొలగించి.. అత్యధిక సౌండ్ వచ్చే హారన్లను బిగిస్తున్నారు. ట్రాఫిక్ ఉన్నప్పుడు, టోల్‌గేట్లు, చెక్‌పోస్టుల తదితర వాటి దగ్గర యథేచ్ఛగా హారన్లను మోగిస్తున్నారు. వీటి మోతతో ముందు వెళ్తున్న వాహనచోదకులు తత్తరపాటుకు గురై ప్రమాదాలకు లోనవుతున్నారు.

చీకటి మాటున అసాంఘిక పనులు

వాహనాలను వాటి యజమానులు ఇష్టారాజ్యంగా మలచుకుంటున్నారు. వాహనంతో పాటు వచ్చిన హెడ్‌లైట్లను తీసివేసి హైఓల్టేజీ లైట్లు బిగిస్తున్నారు. రాత్రి వేళల్లో ఎదురుగా వస్తున్న వాహన డ్రైవర్లకు రహదారి స్పష్టంగా కనిపించదు. దీంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. ప్రధానంగా కారు అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ వినియోగిస్తున్నారు. కంపెనీ నుంచి వచ్చిన కారు లోపల ఎవరున్నారన్న దానిపై స్పష్టంగా ఉండాలి. అయితే ఆ అద్దాలకు బ్లాక్ ఫిల్మ్ బిగించి రోడ్డు పక్కన ఆపేసి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఘటనలు కోకొల్లలు.

చోద్యం చూస్తున్న రవాణా శాఖ అధికారులు

రవాణా నిబంధనలు అతిక్రమించి వాహనాలను యథేచ్ఛగా తిప్పుతున్నా.. జిల్లా రవాణా శాఖ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇలాంటి వాహనాల జోలికి వెళ్లడం లేదు. హెల్మెట్ లేదనో, లైసెన్స్ లేదనో ద్విచక్ర వాహనదారులపైన, ఎక్కువ మందిని ఎక్కించుకున్నారంటూ ఆటో వాలాలపైన కేసులు నమోదు చేస్తున్న రవాణా శాఖాధికారులు నిబంధనలు అతిక్రమిస్తున్న వాహనాలను పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి.

ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తాం



రవాణా వాహన చట్టం ప్రకారం ప్రతి వాహనదారుడు నిబంధనలు పాటించాలి. వాహన నంబరు ప్లేటు స్పష్టంగా కనబడాలి. హైసెక్యూరిటీ నంబరు ప్లేటును మాత్రమే బిగించాలి. పోలీసు, ప్రెస్, ఇతర ఏ పేర్లు నంబరు ప్లేటు మీద ఉండకూడదు. బ్లాక్ ఫిల్మ్ వినియోగించకూడదు. సైరన్‌లు అంబులెన్స్, పోలీసు అధికారులు మాత్రమే వినియోగించాలి. జిల్లాలో ఇతర రాష్ట్రాలకు చెందిన వాహనాలు ఎక్కువ రోజులు తిరగకూడదు. వీటిపై కూడా ప్రత్యేక దృష్టి సారిస్తాం.

– బి.చందర్, డీటీసీ

న్యూస్‌రీల్

ఇంటర్ సెకండియర్ పరీక్షలు ప్రారంభం



నెల్లూరు (టౌన్): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలిరోజు తెలుగు, సంస్కృతం, హిందీ, ఉర్దూ పరీక్షలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 24,398 మంది విద్యార్థులకుగానూ 23,905 మంది హాజరయ్యారు. 493 మంది గైర్హాజరయ్యారు. పరీక్ష ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగింది. జిల్లాలో ఆర్ఐఓ 3, డీవీఈఓ 3, డీఈసీ సభ్యులు 7, ఫ్లయింగ్, సిట్టింగ్ స్క్వాడ్ అధికారులు 24 సెంటర్లలో తనిఖీలు నిర్వహించారు.

7 నుంచి సంస్కృతం మూల్యాంకనం

స్టోన్‌హౌస్‌పేటలోని కేవీసీ జూనియర్ కళాశాలలో ఇంటర్ సంస్కృతం జవాబు పత్రాల మూల్యాంకనను ఈ నెల 7వ తేదీ మధ్యాహ్నం 12.30 నుంచి ప్రారంభించనున్నట్లు ఆర్ఐఓ ఆదూరు శ్రీనివాసులు తెలిపారు. జిల్లాలోని అన్ని యాజమాన్య జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ సంబంధిత సంస్కృతం అధ్యాపకులను రిలీవ్ చేసి మూల్యాంకనానికి పంపించాలన్నారు.

ఓపెన్ స్కూల్ ఇంటర్...

జిల్లా వ్యాప్తంగా ఏపీ ఓపెన్ స్కూల్ ఇంటర్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొత్తం 20 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. 3,179 మంది అభ్యాసకులకు 2,871 మంది హాజరయ్యారు. 308 మంది గైర్హాజరయ్యారు.

స్కూల్ లాగిన్‌లో టెన్త్ హాల్ టికెట్లు

నెల్లూరు (టౌన్): పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి హాల్ టికెట్లు స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉన్నాయని డీఈఓ బాలాజీ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పాఠశాలల హెడ్‌మాస్టర్లు హాల్ టికెట్లలో విద్యార్థుల పేర్లు, పుట్టిన తేదీ, మీడియం, ఫొటో, సంతకం, ఎంచుకున్న సబ్జెక్ట్ కరెక్ట్ ఉన్నాయో లేదో తనిఖీ చేయాలన్నారు. ఏదైనా పొరపాటు ఉన్నట్లయితే వారి సంతకంతో వెంటనే dir govexams @yahoo.com లేదా dir govexams@apschooledu. inకు మెయిల్ చేయాలన్నారు.

రైతులు నిండా మునిగిపోతున్నారు..

- టీడీపీ నేతతోపాటు అన్నదాతల ఆవేదన

కోవూరు: రైతులందరూ నిండా మునిగిపోతున్నారు. గత సీజన్‌లో నాలుగు పుట్లు దిగుబడి వస్తే ఇప్పుడు మూడు పుట్లు మాత్రమే వచ్చింది. గత సీజన్‌లో పుట్టి రూ.24 వేలకు అమ్మితే.. ఇప్పుడు పుట్టి రూ.15,200 కూడా కొనడం లేదు. ఓ టీడీపీ నేత జిల్లా వ్యవసాయశాఖాధికారిణి సత్యవాణిని నిలదీశాడు. మండలంలోని పాటూరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఏఓ సత్యవాణి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ టీడీపీ నేత లక్ష్మిశెట్టి శీనయ్య మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో పట్టలు లేవని, ధాన్యాన్ని ఆరబెడితే వర్షం వస్తే పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇప్పుడు మీటింగ్ పెట్టి ప్రభుత్వ మద్దతు ధర రావాలంటే తేమ శాతం వస్తేనే కొలుస్తామన్నారు. ఇదేం సమాధానం. ఎకరానికి రూ.30 వేలు నష్టపోతున్నాం.. ఈ నష్టం డబ్బులెవరిస్తారు. పౌరసరఫరాల శాఖ మంత్రి మనోహర్ క్వింటాకు రూ.300 ఎక్కువ ఇస్తామన్నారు. ఎక్కడిచ్చారంటూ నిలదీశారు. నిర్దిష్ట తేమ శాతం రావాలంటే.. ఇంకా పది రోజులు ఆరబోయమంటున్నారు. ఎక్కడ ఆరబోయాలి. పట్టలిచ్చారా? కల్లాలిచ్చారా? ఎక్కడ ఆరబోయాలంటూ ప్రశ్నించారు. దీంతో ఆమె ఏదో సర్దిచెప్పి అక్కడి నుంచి వెళ్లిపోయారు.



కొనుగోలు కేంద్రంలో అధికారులతో మాట్లాడుతున్న రైతులు

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలి

ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. పడుగుపాడు సొసైటీని కార్యాలయాన్ని రైతులతో కలిసి సోమవారం ఆయన పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఒక ఎకరానికి సాగు ఖర్చులు రూ.40 వేలు అవుతుంటే.. పుట్టి ధాన్యం రూ.15 వేలకు కూడా మిల్లర్లు కొనడం లేదని, ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, సీనియర్ నాయకురాలు జక్కా శేషమ్మ, రైతు సంఘం నాయకుడు ఎం. వెంగయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు ఎం.పుల్లయ్య, జి శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

తీరానికి కోత..



సముద్ర తీరంలో ఇసుకను అక్రమంగా తరలించడంతో ఇసుక దిబ్బలు చదునుగా మారిన దృశ్యం

అధికారాన్ని అడ్డం పెట్టుకుని కొందరు ప్రకృతి వినాశానికి పాల్పడుతున్నారు. ఈ పరిణామాలు భవిష్యత్‌లో పెను ముప్పునకు దారితీయనున్నాయి. వాతావరణ విపత్తు తలెత్తినప్పుడు తీరంలోనే ఎగిసిపడే అలలు.. గ్రామాలకు గ్రామాలను ముంచెత్తే ప్రమాదాలు లేకపోలేదు. తీరానికి కోత పెడుతూ సాగిస్తున్న ఇసుక దందా మున్ముందు గుండె కోతలను మిగల్చనుంది. ఇప్పటి వరకు నదులు, కాలువలు, వాగుల్లో ఇసుకను కొల్లగొట్టిన అక్రమార్కులు ఇప్పుడు సముద్ర ఇసుకపై పడ్డారు.

- అక్రమార్కుల బరితెగింపు
- సముద్ర ఇసుక అక్రమ రవాణా
- భవిష్యత్‌లో గ్రామాలను ముంచనున్న అలలు

కావలి: ఇసుకాసురుల బరి తెగింపు.. తీర ప్రాంత గ్రామాలకు పెను ముప్పుగా పరిణమించనుంది. అక్రమార్జనే ధ్యేయంగా అధికార పార్టీ అండతో కొందరు సముద్ర ఇసుక దందాకు పాల్పడుతున్నారు. కావలి మండలం అన్నగారిపాళెం, బోగోలు మండలం జువ్వలదిన్నె పంచాయతీ పరిధిలోని సముద్ర తీరంలో ఉన్న ఉప్పు ఇసుకను అక్రమార్కులు కొంత కాలంగా యథేచ్ఛగా తరలిస్తున్నారు. సముద్రం అంచున ఉండే ఇసుకను జేసీబీలు పెట్టి టిప్పర్లతో రేయింబవళ్లు తరలిస్తున్నారు. సముద్ర తీరానికి, గ్రామాల మధ్య రక్షణగా ఇసుక కట్టలు (చెలియ కట్టలు), మడ అడవులు ఉండేవి. కాలక్రమంలో మడ చెట్లు అంతరించిపోవడంతో ఇసుక దిబ్బలే రక్షణ గోడగా నిలుస్తున్నాయి.

ఊర్లకు ఊర్లే కొట్టుకుపోతాయి

ప్రకృతి, వాతావరణంలో మార్పుల కారణంగా సముద్రంలో అల్పపీడన ద్రోణి, వాయుగుండాలు, తుపాన్లు ఏర్పడినప్పుడు తరచూ సముద్రం సాధారణ పరిస్థితి కంటే 50 నుంచి వంద అడుగుల మేర ముందుకు చొచ్చుకు వస్తున్న పరిణామాలను గమనిస్తున్నాం. సముద్రం ముందుకు చొచ్చుకు వచ్చినప్పుడు ఈ ఇసుక కట్టలే రక్షణగా ఉంటున్నాయి. సుమారు 20 ఏళ్ల క్రితం వచ్చిన సునామీ సమయంలో చాలా చోట్ల అనేక గ్రామాలను ఈ ఇసుక దిబ్బలే కాపాడాయి. ప్రస్తుతం అక్రమార్కులు సముద్రం అంచున ఉన్న ఇసుకను తరలించడంతో తీరానికి, గ్రామాలకు మధ్య రక్షణగా ఉండే ఇసుక కట్టలు లేకుండాపోతున్నాయి. ఈ పరిణామాలతో భవిష్యత్‌లో ఇంతకంటే ఎక్కువ స్థాయిలో అలల ఉధృతి పెరిగితే నేరుగా అలలు తీర ప్రాంతాల్లోని ఊర్లకు ఊర్లే కొట్టుకుపోయే ప్రమాదం పొంచి ఉందని స్థానిక మత్స్యకారులు ఆందోళన చెందుతున్నారు. సముద్రం ఒడ్డున ఇసుకను విచ్చలవిడిగా తరలిస్తున్నా.. మత్స్యశాఖ అధికారులు, గ్రామ రెవెన్యూ అధికారులు, సచివాలయ అధికారులు, సిబ్బంది కళ్లు మూసుకుని తమకేమి పట్టనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు పోన్నపూడి తాతారావు

సముద్రపు ఇసుక తరలింపు ప్రమాదకరం

కావలి ప్రాంతంలోని సముద్ర తీరప్రాంతం నుంచి ఇసుకను జేసీబీల సహాయంతో టిప్పర్ల ద్వారా విచ్చలవిడిగా తరలిస్తున్నారని, ఇది ప్రమాదకరమని జాతీయ మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు పోన్నపూడి తాతారావు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్ ఒ.ఆనంద్ వినతి పత్రం అందజేశారు. ఇసుక తవ్వకాలతో భవిష్యత్‌లో అలలు గ్రామాలను ముంచెత్తే అవకాశం లేకపోలేదని పేర్కొన్నారు. ఈ ఇసుకను ఎక్కడికి తరలిస్తున్నారో తెలియడం లేదు. ఆ ఇసుకతో సాగించే నిర్మాణాలకు భద్రత ఉండదు. ఇసుక అక్రమ రవాణా సాగిస్తున్న వ్యవహారంపై విచారణ జరిపి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



జామాయిల్ తోటలో వీరప్పన్‌లు

▸▸ అటవీ సంపదను యథేచ్ఛగా కొల్లగొడుతూ..

ఉదయగిరి నియోజకవర్గంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఎన్నో ఏళ్లుగా పెంచుతున్న జామాయిల్ తోటల్లో విలువైన కర్రను కొందరు అక్రమార్కులు కొల్లగొడుతున్నారు. మార్కెట్లో గిరాకీ ఉండటంతో ఇంటి దొంగలతో చేతులు కలిపి అక్రమార్జనకు పాల్పడుతున్నారు. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలిసినా ఉదాసీనంగా వ్యవహరిస్తుండటంతో వీరు మరింత రెచ్చిపోతున్నారు. ఈ పరిణామాలతో అడవిలో వీరప్పన్‌ల స్వైరవిహారం నానాటికీ అధికమవుతోంది.

- రూ.లక్షల విలువజేసే చెట్ల నరికివేత
- గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు
- అక్రమార్కులతో ఇంటి దొంగల కుమ్మక్కు
- వీఎస్సెస్ కమిటీల ఆందోళన

ఉదయగిరి: అక్రమార్కులకు జామాయిల్ చెట్లు కాసుల వర్షాన్ని కురిపిస్తున్నాయి. అటవీ సందపను యథేచ్ఛగా కొల్లగొడుతూ.. గుట్టుచప్పుడు కాకుండా విక్రయాలు సాగిస్తున్నా, చోద్యం చూడటం అధికారుల వంతవుతోంది. అక్రమార్కులకు వీరు పరోక్ష సహకారం అందిస్తున్నారనే ఆరోపణలూ లేకపోలేదు.

వేలాది ఎకరాల్లో పెంపకం

ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల పరిధిలో అటవీ శాఖకు చెందిన భూముల్లో వేలాది ఎకరాల్లో జామాయిల్ తోటలను స్థానిక వీఎస్సెస్‌ల ఆధ్వర్యంలో పదేళ్లుగా పెంచుతున్నారు. జామాయిల్ కర్ర సైజ్ బాగా పెరిగింది. రెండేళ్లుగా దీని ధర ఎక్కువగా ఉండటంతో కొంతమంది అక్రమార్కుల కన్నుపడింది. నందిపాడు, వరికుంటపాడు బీట్ పరిధిలోని కొన్ని ప్లాంటేషన్లలో జామాయిల్‌ను గుట్టుచప్పుడు కాకుండా నరికి కర్మాగారాలకు తరలించి రూ.లక్షలను ఆర్జిస్తున్నారు.



వరికుంటపాడు మండలం రామదేవులపాడు అటవీ ప్రాంతంలో నరికివేతకు గురైన జామాయిల్ కర్ర

అక్రమార్కులతో మిలాఖత్

గతంలో పనిచేసిన రేంజర్ స్థాయి అధికారి, సిబ్బంది.. అక్రమార్కులతో కలిసి రూ.50 లక్షల విలువజేసే జామాయిల్ కర్రను స్వాహా చేశారనే ఆరోపణలున్నాయి. టెండర్ల ప్రక్రియలో కటింగ్ చేసిన జామాయిల్ కర్రలో ఈ అక్రమాలు జరిగాయనే ప్రచారం సాగుతోంది. ప్లాంటేషన్లలోని కర్రలో కొంతమేర టెండర్‌దారుడికి విక్రయించి మిగిలిన మొత్తాన్ని విడిగా తరలించి అక్రమార్జనకు తెరలేపారని తెలుస్తోంది.

ఇంటి దొంగల పాత్రతో మౌనం

ఇంటి దొంగల పాత్ర ఉండటంతో ఎలాంటి చర్యలు చేపట్టకుండా మౌనం వహించారు. భారీ మొత్తంలో చేతులు మారడంతో బయటకు పొక్కకుండా రహస్యంగా ఉంచారనే ఆరోపణలున్నాయి. రామాపురం, కాంచెరువు, డక్కునూరు అటవీ భూముల్లో విలువైన క్వార్ట్జ్ (తెల్లరాయి), పల్సర్ ఖనిజ సంపదను రాత్రి వేళ పెకిలించి ట్రాక్టర్ల ద్వారా వేరే ప్రాంతానికి తరలిస్తున్నారు. ఈ తంతులోనూ అటవీ సిబ్బంది పాత్ర ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విజిలెన్స్, సీఐడీ విచారణే దిక్కు

ఉదయగిరి రేంజ్ పరిధిలో సాగుతున్న ఈ అక్రమాలు వెలుగులోకి రావాలంటే విజిలెన్స్ లేదా సీఐడీ అధికారులతో విచారణ చేయించాలని స్థానిక వీఎస్సెస్ కమిటీల సభ్యులు కోరుతున్నారు. కమిటీ సభ్యుల్లో కొందరి పాత్ర ఉందని వారే అంగీకరిస్తున్నారు. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే రూ.కోట్ల విలువజేసే అటవీ సంపదను అక్రమార్కులు భవిష్యత్తులో దోచేసే అవకాశం ఉంది. ఈ విషయమై ఉదయగిరి రేంజ్ అటవీ అధికారి కుమారరాజాను సంప్రదించేందుకు ఫోన్లో యత్నించగా, ఆయన అందుబాటులోకి రాలేదు.

ముడుపులతో మభ్యపెట్టి

నందిపాడు బీట్‌లో జరిగిన ఈ వ్యవహారాన్ని స్థానిక వీఎస్సెస్ కమిటీ గుర్తించింది. గుట్టు రట్టు చేస్తామని బెదిరించడంతో రూ.నాలుగు లక్షలిచ్చి నోరు మూయించారని సమాచారం. మరోవైపు వరికుంటపాడు బీట్ పరిధిలోని రామదేవులపాడు అటవీ భూముల్లో సైతం సుమారు రూ.50 లక్షల విలువజేసే జామాయిల్ కర్రను మాయం చేశారని తెలుస్తోంది. విషయం తెలుసుకున్న ప్రస్తుత అధికారులు తమ సిబ్బందితో కలిసి విచారణ జరిపించగా, వ్యవహారం వాస్తవమేనని తేలింది.

క్లుప్తంగా

వీఆర్వో, సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలి

• వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న విజయకుమార్‌రెడ్డి

నెల్లూరు సిటీ: ఉన్నతాధికారులకు సమాచారం కూడా ఇవ్వకుండా టీడీపీ నాయకుల ఆదేశాలతో ఆమంచర్ల బిట్–2 ఎంపీటీసీ సభ్యుడు సురేంద్రరెడ్డికి చెందిన స్థలం హద్దు కంచెను తొలగించిన వీఆర్వో, సచివాలయ సర్వేయర్‌పై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆనం విజయకుమార్‌రెడ్డి డిమాండ్ చేశారు. నెల్లూరులోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ లాజరస్‌కు సోమవారం అప్పయ్యకండ్రిగ గ్రామస్తులు, సురేంద్రరెడ్డితో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విజయకుమార్‌రెడ్డి మాట్లాడుతూ అప్పయ్యకండ్రిగలోని పడమరవీధిలో సురేంద్రరెడ్డికి చెందిన పూర్వీకుల స్థలం చుట్టూ ఉన్న హద్దు కంచెను వీఆర్వో, సచివాలయ సర్వేయర్‌లు జేసీబీతో తొలగించారన్నారు. గ్రామస్తులు ప్రశ్నించగా వారు అక్కడి నుంచి వెళ్లిపోయారన్నారు. ఈ క్రమంలో తాను రూరల్ సీఐకి ఫోన్ చేసి లా అండ్ ఆర్డర్ సమస్య వస్తుందని, చర్యలు తీసుకోవాలని చెప్పానన్నారు. అలాగే డిప్యూటీ తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్తే తాము ఆదేశాలివ్వలేదని చెప్పారన్నారు. టీడీపీ నాయకుల ఆదేశాలతో కంచె తొలగించారని మండిపడ్డారు. ఈ ఘటనపై విచారణ జరిపి వారిద్దరిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకపోతే కలెక్టర్ దృష్టికి సమస్యను తీసుకెళ్తామన్నారు. బాధితుడిపైనే జేసీబీ నిర్వాహకుడు తప్పుడు కేసు పెట్టారన్నారు. సురేంద్రరెడ్డి ఆమంచర్లలోని 23 కుటుంబాలకు న్యాయం చేసేందుకు ముందుకు రావడమే చేసిన తప్పా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ మండలాధ్యక్షుడు పుచ్చలపల్లి రాంప్రసాద్‌రెడ్డి, నాయకులు శివాజీ, వెంకటసుబ్బారెడ్డి, రఘురామ్‌రెడ్డి, సుమన్‌రెడ్డి, సింహాద్రి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో సీనియారిటీ జాబితా

నెల్లూరు(టౌన్): జిల్లాలోని ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, మున్సిపాలిటీ పరిధిలోని స్కూళ్లలో పనిచేస్తున్న ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల సాధారణ సీనియారిటీ జాబితాను పాఠశాల విద్యాశాఖ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈఓ ఆర్.బాలాజీరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దానిపై అభ్యంతరాలుంటే మంగళవారం నుంచి 10వ తేదీ లోపు సంబంధిత జిల్లా విద్యాశాఖ, ప్రాంతీయ సంయుక్త సంచాలకుల పాఠశాల విద్యాశాఖకు సమర్పించాలన్నారు. అభ్యంతరాలను ఫిర్యాదుల పరిష్కార కమిటీ పరిశీలించి తుది నిర్ణయాన్ని తెలియజేస్తుందన్నారు. వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

లైంగికదాడి కేసులో ఒకరికి పదేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడినట్టు నమోదైన కేసులో దేవరకొండ విజయకుమార్ అనే వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష, రూ.22 వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. జలదంకి ప్రాంతానికి చెందిన ఓ బాలిక 2017లో బ్రాహ్మణక్రాక గ్రామంలోని బంధువులు ఇంటికి వెళ్లింది. అదే గ్రామానికి చెందిన విజయకుమార్ ప్రేమ పేరుతో నమ్మించి బాలికను కిడ్నాప్ చేసి లైంగికదాడికి పాల్పడ్డాడు. బాధితురాలి తాత ఫిర్యాదు మేరకు జలదంకి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో జైలుశిక్ష, జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

గుర్తుతెలియని మృతదేహాలు లభ్యం

వెంకటాచలం: మండలంలోని జోసఫ్‌పేట గ్రామ సమీపంలో సర్వేపల్లి రిజర్వాయర్‌లో గుర్తుతెలియని మహిళ మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించారు. గత నెల 20వ తేదీన గొలగమూడి సమీపంలో సర్వేపల్లి కాలువలో మహిళ మృతదేహం నీటి ప్రవాహంలో కొట్టుకుపోవడాన్ని రైతులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఆ మృతదేహం జోసఫ్‌పేట వద్ద రిజర్వాయర్ కట్ట అంచుకు రావడంతో స్థానికులు చూసి పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు.

అల్లూరు కాలువలో..

కొడవలూరు: మండలంలోని గండవరం సమీపంలోని అల్లూరు కాలువలో సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సీహెచ్ కోటిరెడ్డి ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఆ వ్యక్తి చనిపోయి మూడురోజులై ఉండొచ్చని భావిస్తున్నారు. బ్లూ కలర్ కాటన్ చొక్కా, లుంగీ ధరించి ఉన్నాడు. మద్యం బాటిల్ ఉన్నట్లు ఎస్సై తెలిపారు. ఉదయకేశ్వరుని తిరునాళ్లకు వచ్చి బహిర్భూమి నిమిత్తం కాలువ వద్దకు వెళ్లి మద్యం మత్తులో కాలువలో పడి మృతిచెంది ఉండొచ్చని ప్రాథమికంగా భావిస్తున్నారు.

ప్రతి వారం వెల్లువలా అర్జీలు


• ఈ సోమవారం సంఖ్య 436
• కలెక్టరేట్‌లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు రూరల్: అర్జీల సంఖ్య తగ్గడం లేదు. మండలాల్లోని కొందరు అధికారులు సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టకపోవడంతో ప్రజలు జిల్లా కేంద్రం బాట పడుతూనే ఉన్నారు. సోమవారం నెల్లూరు కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. కలెక్టర్ ఆనంద్, అధికారులు వినతులు స్వీకరించారు. ఈసారి కూడా రికార్డు స్థాయిలో 436 అర్జీలను ప్రజలు అందజేశారు. రెవెన్యూ శాఖకు సంబంధించి 169, పోలీస్ శాఖవి 61, మున్సిపల్ శాఖవి 36, సర్వేవి 36, పంచాయతీరాజ్ శాఖవి 34, విద్యుత్ శాఖవి 9 తదితర శాఖలకు సంబంధించి అర్జీలు అందాయి. ఈ సందర్భంగా కలెక్టర్ ఆనంద్ మాట్లాడుతూ అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ అంశాలకు సంబంధించి వినతులు ఎక్కువగా వస్తున్నాయని వాటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, జెడ్పీ సీఈఓ విద్యారమ, జిల్లా పంచాయతీ అధికారి శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.


న్యాయం చేయండి



మాట్లాడుతున్న సుజాత

తమకు చెందిన 1.65 ఎకరాల భూమికి దొంగ పట్టా సృష్టించి లేఅవుట్ వేసేందుకు రియల్ ఎస్టేట్ వాళ్లు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని పాత మెట్టపాళేనికి చెందిన దారా సుప్రజ వినతిపత్రం సమర్పించారు. రెండు నెలల ముందు కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారులు దొంగ పట్టా సృష్టించారన్నారు. ఇటీవల తన భర్తపై కేసులు పెట్టించారని ఆమె ఆరోపించారు. ఆయన్ను విడుదల చేయించాలని కోరారు.

ఇంటి స్థలాలివ్వాలంటూ..



కలెక్టరేట్ వద్ద డప్పు కళాకారులు

మేం నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో ఉంటున్నాం. కొత్తూరు నుంచి ఆమంచర్ల లోపు ఎక్కడైనా కాలనీ ఏర్పాటు చేసి ఇంటి స్థలాలు మంజూరు చేయాలి. చాలీచాలని సంపాదనతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించాలి.

– డప్పు కళాకారులు


కార్మికుల సమస్యల పరిష్కారం కోసం..



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేట్ ఏజెన్సీలకు మున్సిపల్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను అప్పగించేందుకు యత్నించడం దారుణమని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పెనుమల్లి శంకర్ కిశోర్ అన్నారు. కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేస్తామని లీకులిస్తున్నారని తెలిపారు. ఒక వ్యవస్థను మార్చాలంటే అంతకంటే మంచి మార్గం చూపాలే తప్ప రద్దు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. దీని వల్ల ప్రైవేట్ ఏజెన్సీలు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తాయన్నారు. అవుట్ సోర్సింగ్ పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు.

బీజేపీ నేతల నిరసన



మాట్లాడుతున్న మిడతల రమేష్

హౌసింగ్ అధికారులు ప్రభుత్వ ఆదేశాలు పాటించలేదని బీజేపీ నేత మిడతల రమేష్ అన్నారు. నాయకులు కలెక్టరేట్‌లో నిరసన తెలిపి అధికారులకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జిల్లాకు కేటాయించిన పీఎంఏవై గృహాలు అసంపూర్తిగా ఉన్నాయన్నారు. కొందరు అధికారులు ఫైనల్ బిల్లులు చేసి అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. విజిలెన్స్ విచారణకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపకుండా ఏమీ పట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో నిధులు విడుదల కావడం లేదన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీకి చెందిన కందికట్ల రాజేశ్వరి, పొట్లూరు శ్రీనివాసులు, ప్రసాద్, రఘురామయ్య, పద్మ, సుజన, నాగేంద్రసింగ్, ఓజిలి సుధాకర్ నారాయణ యాదవ్, సుబ్బయ్య యాదవ్, కల్లు భాస్కర్, ముజీబ్, వెంకటేష్, ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కుమారుల్ని స్వదేశానికి రప్పించాలంటూ..



మాట్లాడుతున్న జయమ్మ, పెద్దయ్య

ఏజెంట్ మోసంతో మా పిల్లలు మలేసియా జైల్లో చిక్కుకున్నారని, వారిని స్వదేశానికి రప్పించాలని రాపూరు మండలం తెగచర్లకు చెందిన కరిపం జయమ్మ, పెద్దయ్య కోరారు. ఈ మేరకు కలెక్టర్ ఆనంద్‌కు వినతిపత్రం సమర్పించారు. గ్రామానికి చెందిన కరిపం సింహాద్రి, పవన్ పదినెలల క్రితం చెన్నైలోని ఓ ఏజెంట్ ద్వారా మలేసియాలోని హోటల్లో పనినిమిత్తం వెళ్లారు. ఏజెంట్ వర్క్ పర్మిట్ అని చెప్పడంతో నమ్మి మోసపోయారు. మూడు నెలల క్రితం వర్క్ పర్మిట్ లేదని, అది కేవలం టూరిజం వీసా అని పోలీసులు అరెస్ట్ చేసి జైల్లో పెట్టారు. దీనిపై ఏజెంట్‌ను సంప్రదించగా అతను సరిగా సమాధానం ఇవ్వట్లేదని తల్లిదండ్రులు తెలిపారు. ఎలాగైనా వారిని ఇండియాకు రప్పించాలని కలెక్టర్‌ను వేడుకున్నారు.

'నా కుమారుడు దౌర్జన్యం చేస్తున్నాడు'



బాధితుల సమస్యలు వింటున్న ఎస్పీ కృష్ణకాంత్

• పోలీసులకు ఓ తండ్రి ఫిర్యాదు
• సినిమాల్లో అవకాశం పేరుతో లైంగికదాడి
• ఓ యువతి ఆవేదన
• నెల్లూరులో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'

నెల్లూరు(క్రైమ్): 'వృద్ధాప్యంలో ఉన్న నన్ను బాగా చూసుకుంటానని చిన్న కుమారుడు నమ్మించాడు. నా పేరు మీద ఉన్న ఇంటిని తన పేరుపై రాయించుకుని పట్టించుకోవడం లేదు. ఇదేమని ప్రశ్నిస్తే దౌర్జన్యం చేస్తున్నాడు. విచారించి న్యాయం చేయండి' అంటూ తోటపల్లిగూడూరు మండలానికి చెందిన ఓ వృద్ధుడు పోలీసులను కోరాడు. సోమవారం నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. 85 మంది విచ్చేసి తమ సమస్యలను వినతుల రూపంలో ఎస్పీ జి.కృష్ణకాంత్‌కు అందజేశారు. త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంత పోలీస్ అధికారులను ఎస్పీ ఆదేశించారు. కార్యక్రమంలో ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, నగర, ఎస్బీ డీఎస్పీలు పి.సింధుప్రియ, ఎ.శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ బి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని..

➡ నెల్లూరు బారకాస్ సెంటర్‌కు చెందిన సునీల్ అనే వ్యక్తి ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమయ్యాడు. సినిమా రంగంలో అడుగులు వేయాలంటే ఆడిషన్స్ కోసం హైదరాబాద్‌కు వెళ్లాలని నమ్మించాడు. అక్కడకు తీసుకెళ్లి మత్తుపానీయాలిచ్చి లైంగికదాడి చేశాడు. అసభ్యకర ఫొటోలు, వీడియోలు తీశాడు. తాను చెప్పినట్లు వినకపోతే వాటిని సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానని బెదిరించి నగదు తీసుకున్నాడు. ఇంకా కావాలంటూ దాడి చేయడమే కాకుండా నన్ను ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. అతడిపై చర్యలు తీసుకోవాలని దర్గామిట్టకు చెందిన ఓ యువతి కోరారు.

➡ హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నానని పొదలకూరుకు చెందిన సునీల్ అనే వ్యక్తి నమ్మించాడు. నా కుమారుడికి అక్కడ ఉద్యోగం ఇప్పిస్తానని రూ.1.43 లక్షలు తీసుకున్నాడు. నెలలు గడుస్తున్నా జాబ్ ఇప్పించలేదు. నగదు తిరిగివ్వాలని కోరగా పట్టించుకోవడం లేదు. విచారించి న్యాయం చేయాలని పొదలకూరుకు చెందిన వ్యక్తి ఫిర్యాదు చేశాడు.

➡ నా ఆర్థిక అవసరాల నిమిత్తం రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాను. అక్కడి కాంట్రాక్టర్ రమేష్ కోరిక తీర్చాలంటూ ఒత్తిడి చేశాడు. నిరాకరించడంతో కోపంతో నాపై దాడిచేసి అవమానకరంగా మాట్లాడాడు. అతడిపై చర్యలు తీసుకోవాలని తోటపల్లిగూడూరు మండలానికి చెందిన ఓ మహిళ కోరారు.

➡ నా భర్త మద్యం వ్యసనానికి బానిసై నన్ను, పిల్లలను పట్టించుకోవడం లేదు. మద్యం మత్తులో మమ్మల్ని శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నాడని వేదాయపాళేనికి చెందిన ఓ మహిళ ఫిర్యాదు చేశారు.

➡ నెల్లూరు రూరల్ మండలానికి చెందిన శ్రీనివాసులురెడ్డి అనే వ్యక్తి నాకు ప్లాట్‌ను విక్రయించాడు. అందులో నిర్మాణ పనులు చేపడుతుండగా ఆ స్థలం తమదని కొందరు అడ్డుకున్నారు. విచారించగా డబుల్ రిజిస్ట్రేషన్ అని తేలింది. విచారించి చర్యలు తీసుకోవాలని ఓ వ్యక్తి అర్జీ ఇచ్చాడు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.61
సన్నవి : రూ.40
పండ్లు : రూ.30

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	:119
లేయర్ (లైవ్)	: 85
బ్రాయిలర్ చికెన్	:214
బ్రాయిలర్ స్కిన్‌లెస్	:236
లేయర్ చికెన్	:145

కూటమి ప్రభుత్వంలో రైతులకు అన్యాయం

• మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి



కసుమూరులో రైతుల సమస్యలను తెలుసుకుంటున్న గోవర్ధన్‌రెడ్డి

వెంకటాచలం: కూటమి ప్రభుత్వంలో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. మండలంలోని కసుమూరు గ్రామంలో సోమవారం ఆయన రైతులతో కలిసి ధాన్యం రాసులను పరిశీలించారు. పంటకు మద్దతు ధర లేదని, కొనుగోలు కేంద్రాల్లో గింజ కొనడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం గోవర్ధన్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ప్రతిసారి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలియజేశారు. జిల్లాలో రైతులు పండించిన ధాన్యం 16 లక్షల పుట్లు మార్కెట్‌లోకి వస్తే రూ.400 కోట్ల నష్టం వాటిల్లే ప్రమాదం ఉందన్నారు. అధికారులు 300 ధాన్యం కొనుగోలు కేంద్రాలంటూ ఆర్భాటంగా ప్రకటించినా, క్షేత్రస్థాయిలో పనిచేయడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. కేంద్రాల్లో గోనె సంచులు, కొనుగోలు చేసే సిబ్బంది కనిపించడం లేదన్నారు. మద్దతు ధర లేనికారణంగా ఎకరాకు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు నష్టపోతున్నారని మండిపడ్డారు. బడ్జెట్‌లో మద్దతు ధర కోసం కేవలం రూ.300 కోట్లు మాత్రమే కేటాయించారని, గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రూ.వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధిని ఏర్పాటు చేసి రైతులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర కల్పించినట్లు చెప్పారు. నాడు పుట్టి ధర రూ.23 వేల నుంచి రూ.28 వేల వరకు పలకడంతో రైతులు సంతోషంగా పంటను అమ్ముకున్నారని గుర్తు చేశారు.

దోచుకోవడంపైనే సోమిరెడ్డి దృష్టి

సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి దోచుకోవడంపైనే దృష్టి పెట్టారని కాకాణి విమర్శించారు. ఆయన ప్రజలు, రైతుల సమస్యల్ని పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సాగునీటి కాలువల్లో పనులు చేయకుండానే బిల్లులు చేసుకుని నిధులు స్వాహా చేశాడన్నారు. రైతుల్ని ఆదుకోవాలని కూటమి నేతలు గ్రీవెన్స్‌డేకు వెళ్లి జిల్లా అధికారులను కోరుతున్నట్లు చెప్పారు. దీనిని చూసిన ప్రజలకు ఈ ప్రభుత్వ చేతగానితనం స్పష్టమైందన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో రైతులు పడుతున్న ఇబ్బందులను తెలుసుకోవాలని కోరారు. కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసి, మద్దతు ధర కల్పించి, నష్టపోయిన రైతులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మద్దతు ధర కోసం వైఎస్సార్‌సీపీ రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కనుపూరు కోదండరామిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, మండల కన్వీనర్ కొణిదెన మోహన్‌నాయుడు, విజయభాస్కర్‌నాయుడు, హుస్సేన్, చీకుర్తి నరసయ్య, గుర్రం పుట్టయ్య, సర్పంచ్ కడివేటి శివ, ఉపసర్పంచ్ బాబర్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే

• 177 మందికి డాక్టర్ పట్టాలు



గ్రాడ్యుయేషన్ డేను ప్రారంభిస్తున్న డాక్టర్లు, అధికారులు



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

నెల్లూరు(అర్బన్): నెల్లూరు దర్గామిట్టలోని ఏసీఎస్ఆర్ ప్రభుత్వ మెడికల్ కళాశాలలో సోమవారం రాత్రి గ్రాడ్యుయేషన్ (స్నాతకోత్సవం) డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల పీజీ వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ నరేంద్ర మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల్లో సీటు తెచ్చుకోవడం ఒక వరమన్నారు. ఎంతో కష్టపడి డాక్టర్లుగా మారారని కొనియాడారు. రోగులను గౌరవిస్తూ వారిని ప్రేమగా చూడాలన్నారు. డిప్యూటీ కలెక్టర్ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ రోగుల ప్రాణాలను కాపాడే డాక్టర్లకు సమాజంలో ప్రత్యేక స్థానముందన్నారు. దానిని నిలుపుకొనేందుకు కృషి చేయాలన్నారు. ప్రొఫెసర్లు మస్తాన్‌బాషా, కాలేషాబాషాలు మాట్లాడుతూ నిరంతర శ్రమ వల్లనే నేడు డాక్టర్లుగా మారారని కొనియాడారు. నీతి, నియమాలు, రోగులను ప్రేమతో మాట్లాడే విధానాలే డాక్టర్లను ఉన్నత స్థానంలో నిలుపుతాయన్నారు. నూటికి 80 శాతం పేదరోగులే ఆస్పత్రులకు వస్తారన్నారు. అలాంటి వారిని అక్కున చేర్చుకుని సేవలందించాలని కోరారు. డబ్బు కోసం వైద్య ప్రాథమిక లక్ష్యాలను అమ్ముకోవద్దని సూచించారు. ప్రస్తుతం డాక్టర్లపై దాడులు జరుగుతున్నాయన్నారు. అలా జరగకుండా ఉండాలంటే నైతిక విలువలు పాటిస్తూ.. వాస్తవాలను చెబుతూ వైద్యసేవలందించాలని సూచించారు. ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఆరో బ్యాచ్‌గా నూటికి నూరుశాతం మంది డాకరుగా పట్టాలు అందుకోవడం గర్వకారణమన్నారు. ఈ సందర్భంగా పట్టాలు పొందిన వారందరితో విలువలతో వైద్య సేవలందిస్తామంటూ ప్రమాణం చేయించారు. 177 మందికి పట్టాలు అందజేశారు. అనంతరం ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డాక్టర్లు వెంకటేశ్వర్లు, ఖాదర్‌వలీ, రాజమ్మ, విజిత, పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DIRECT FINAL YEAR

■Last Chance: 10th, Inter, Direct Degree (Disc), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma,MA,M.Com,M.Sc, MBA,MCA.Regular/lateral entry.9381287629 [T-2527]

REAL ESTATE

■నెల్లూరు,ధనలక్ష్మీపురం,వెంకటాచలం,మనుబోలు, గూడూరు, బుచ్చి హైవే ఆనుకొని నుడా అప్రూవ్డ్ ప్లాట్స్ : 10లక్షలు నుండి బ్యాంకు లోన్, స్పాట్ రిజిస్ట్రేషన్. 63098 46680, 93983 40116. [NA-24059]

LAND FOR SALE

■నెల్లూరు To మైపాడురోడ్డు గంగపట్నంలో 2 ఎకరాలు పొలం అమ్మబడును. 1ఎకర 20లక్షలు. సంప్రదించండి: 83088 04379. [NA-24046]

PLOT FOR SALE

■నెల్లూరు ముత్తుకూరు రోడ్డు బ్రహ్మదేవం ఆనంద విహార్ నుడా వెంచర్‌లో అం॥ 53వేలు ప్లాట్ కొన్న వారికి 200గ్రా॥ వెండి, 200 సిమెంట్ బస్తాలు ఉచితం.ఇప్పటికి ఇప్పుడు ఇల్లు కట్టుకునేవారికి 200 సిమెంట్ బస్తాలు ఉచితం. సంప్ర : 77025 37169. [N-1270551]

WANTED

■Wanted Vacancies (MNC) Company. Only Office Work for 20 Numbers. Telecallers and Sales. Contact: 80081 17689, 89780 33150. [NA-3935]

■Wanted Lady Tele Callers to Work for top University, Location Magunta Layout. Qual : 10th/ Inther/ Degree. Salary: 10k to 15k + Incentives. Cont : 70364 33339. [NA-24062]

■LED Light Menufacturing Campany looking for Telecallers - 2 No's, Sales Manages-2 No's in Nellore fo details (female). 76590 40542 [G-9714]

■ఫోర్స్ కంపెనీ షోరూం నందు పని చేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, మెకానిక్స్, హెల్పర్స్, 6టైర్ డ్రైవర్ కావలెను. బుజబుజనెల్లూరు, నెల్లూరు. సెల్ : 95812 99916, 94929 34103. [NA-11247]

■చంద్రా ట్రేడర్స్, RKT పెట్రోల్ బంకు ఎదురుగా, సుబేదారుపేట, నెల్లూరు నందు పని చేయుటకు కౌంటర్ సేల్స్ బాయ్స్/ గర్ల్స్, హెల్పర్స్ కావలెను. నెల్లూరు టౌన్‌లోని వారు సంప్ర: 94404 33162. [NA-926]

■నెల్లూరు టౌన్‌లోని ప్రముఖ హాస్పిటల్ నందు Only డే డ్యూటీ పని చేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను.Age:30-50,Qlf:10th P/F, 12గం॥డ్యూటీ, జీ: 13,000/-. 99594 44086, 94900 22205. [NA-24039]

■లేడీ రిసెప్షనిస్ట్ : నెల్లూరు విజయమహల్ గేట్ వద్ద గల మా ఆఫీసు నందు పని చేయుటకు లేడీ రిసెప్షనిస్ట్ (విద్యార్హత : డిగ్రీ / ఇంటర్) మరియు హెల్పర్ కావలెను. సంప్ర: 86865 55155. [NA-927]

ప్రకటన గోరంత స్పందన కొండంత

డాక్యుమెంటు పోయినది

D.No.: 3-9-15. ... 15-2-2025 ...

9866445213

■నెల్లూరు మాగుంట లేఅవుట్, క్లాసిక్ మార్కెటింగ్ టైల్స్ & శానిటరీ వేర్ షోరూంలో వర్క్ చేయుటకు M/ F & డెలివరీ బాయ్స్ కావలెను. Qlf: ఇంటర్, డిగ్రీ. సెల్ : 88076 16861, 94912 71139. [NA-24060]

■శ్రీ వేంకటేశ్వర ఫైనాన్స్ నెల్లూరు నందు కావలి, అల్లూరు, నెల్లూరు, వెంకటగిరిలో పని చేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ & కంప్యూటర్ ఆపరేటర్స్ అమ్మాయిలు కావలెను. సంప్ర : 97001 10061. [NA-6842]

■ప్రభుత్వసంస్థలల్లోఅవుట్‌సోర్సింగ్‌పద్ధతిలో పనిచేయుటకు కంప్యూటర్‌ఆపరేటర్,అటెండర్,GNM, హౌస్‌కీపింగ్‌సూపర్‌వైజర్‌లుకావలెను.అన్నిరకాల కాంట్రాక్ట్‌ఉద్యోగాలకు:9949942245,9154916915 [T-2525]

■మా సంస్థ నందు పని చేయుటకు సూపర్ వైజర్స్, Assts, డ్రైవర్లు, (ITI, Dip., B.Tech all) Ex.ఆర్మీ కావలెను. PF, ESI, రూం + భోజనం సౌకర్యం. జీ: 18-32 వేలు ✆ 99636 68079 [B-752863]

■కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15 వేలు - 40వేలు,ఫ్రీ రూం+భోజనం. HYD. 9347197693 [HA-99983]

■ప్రముఖ సెక్యూరిటీ సంస్థకు నెల్లూరులో డ్యూటీ చేయుటకు సెక్యూరిటీగార్డ్స్ కావలెను. జీతం: రూ.14,000/-, 2 వీలర్ లైసెన్స్ ఉన్న డెలివరీ బాయ్స్ కావలెను.జీతం: రూ. 15,000/-. సంప్రదించండి: 99089 54793, 77025 77508. [NA-6843]

■ప్రముఖ విద్యాసంస్థకు అకాడమిక్ ప్రిన్సిపల్ 6th to 10th ఫిజిక్స్ టీచర్లు, గ్రాఫిక్ డిజైనర్,క్లర్స్, కారు డ్రైవరు కావలెను. నాన్ లోకల్‌కు ఉచిత వసతి, నలంద ఒలంపియాడ్ స్కూలు, మానస థియేటర్ దగ్గర,కావలి. 99498 49758,74161 62088. [NA-1268163]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి రోజు క్లాసిఫైడ్స్ సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే తీసుకొనబడును. ఆ పైన పంపిన ప్రకటనలు ప్రచురించబడవు.